# చివరి అంకం

[కథానిక]

శ్రీ పంతుల శ్రీరామశాస్త్రి

'సంప్రదాయం' అనే సరికొత్త సాంఘిక నాటకం; చివరి అంకం స్టేజిమీద జరుగుతూంది. రిజర్వుడు క్లాసులో కూర్చొని అంతసేపూ అతితన్మయత్వంతో చూస్తున్న సన్యాసిరావుకు నాటకంలోని పాత్రలు, సంఘటనలు వీటిమీద మనస్సు నిలవడం లేదు. తన గతజీవితమూ, ప్రస్తుత పరిస్థితీ, భావికార్యక్రమమూ ఇన్నీ ఒకదానితో ఒకటి పెనగొని, కలత పెట్టడంవల్ల చివరికి ఎట్టఎదురుగా ఏమి చూస్తున్నాడో కూడా గమనించని స్థితిలోకి వచ్చేడు సన్యాసిరావు. తెరపడిపోవడం, నలుగురూ లేవడం, అంతతో తనూ లేచేడు. అంతేకాని, ఆరంభంలో అంత ఉత్సాహంతో, అభిమానంతో చూడడం ఆరంభించిన నాటకం ఏవిధంగా సాంతమయిందో సరిగా తెలియలేదు, సన్యాసిరావుకు. అయితే చివరి అంకంలో అంత రభసంగా అందరు కొత్తపాత్రలను ప్రవేశపెట్టి, అన్ని పరస్పరసంబంధంలేని సంఘటనలు కిట్టించడం నాటకరచనదృష్ట్యా గొప్ప పని అయితే కావచ్చును గాని, తనకుమటుకు అట్టే రుచించలేదనుకొని, ఈ మాటే నాటకకర్త, తన బాల్యమిత్రుడు సత్యనారాయణకు రాయాలనుకొన్నాడు, హాలులోంచి బైటికి వస్తూ. ఆమాత్రం ఈమాత్రం అశ్రద్ధగా ఉంటేమాత్రం నాటకకథ అందరికీ తెలియవద్దూ? ఇంతకూ నాటకం చూడడానికి వచ్చేవాళ్లు ఏదో నాటకం చూసి కులాసాగా కాలం గడుపుదామని వస్తారుగాని, లెక్కల తెలివితేటలూ, శుష్కతార్కికజ్ఞానమూ ఉపయోగించి బుఱ్ఱచించుకుందుకు రారుకదా! ఇవి అతని ఊహకు దాపుకట్టలు. ఇంతా తను అశ్రద్ధగా ఉన్నాడన్న విషయాన్ని ఒప్పుకొందుకు తన మనస్సుదగ్గర పడే మొగమాటం.

కాని నాటకంమాత్రం తన పనిని సన్యాసిరావు మీద అద్భుతంగా చేసిందనాలి. ఎంచేతంటే నాటకం చూడడం అన్నదే సన్యాసిరావు పద్ధతికి చాలా వ్యతిరేకమయిన సంగతి. ఈ పదేళ్ల మధ్యనూ అతను నాటకాలకు అసలే వెళ్ల లేదు. సినీమాలకుకూడా వెళ్లినది లెక్కగా ఏ అయిదారుమార్లో; అదీ ఇతరుల బలవంతం మూలంగానే. వాటిలో చూసినదిగాని, విన్నదిగాని అతనిని అట్టే ఆకర్షించలేదు. అటువంటి మనిషి ఈ నాటకంకోసం మూడునాలుగు రోజులు ముందుగా ప్రకటన చూసినప్పటినుండి, ఎదురుచూడసాగాడు. అయితే ఆ ఎదురుచూడడం నాటకం చూడాలన్న కుతూహలంచేతకంటె అది రాసినవాడు తన బాల్యమిత్రుడన్న కారణంచేత కావచ్చును. పైగా ఎవళ్లో అన్నారు—కవిగారుకూడా నాటకం ట్రూపుతో వచ్చి స్వయంగా డైరెక్టుచేస్తారని. బహుశః తానీఊళ్లో ఉన్నాడని వాడికి (కవికి) తెలియకపోవచ్చు. అయితే తాను నాటకం ట్రూపు బసదగ్గరకువెళ్లి, తీరా వాడు వచ్చేడోలేదో, ఊరికే తాపత్రయపడి, నలుగురినీ అడిగి, నేను ఫలానా అని చెప్పుకొని, అతనితో మాట్లాడవలసిఉందని చెప్పుకోనేకంటె, లక్షణంగావెళ్లి టిక్కెట్టుతీసుకొని ముందువరసలో కూర్చొని నాటకం చూడడం మంచిది. ఈలోగా అతను వచ్చేడో లేదో తెలుస్తుంది. కాక, ఈలోపున అతనే తనను చూస్తే పలకరించడానికి సావకాశం కూడా కలగవచ్చు. లేకుంటే తను సామాన్యంగా నలుగురితోపాటు నాటకం చూసి వచ్చేస్తాడు. ఇది అతని ఏర్పాటు. చివరికి అదే మంచిదనిపించింది. నాటకారంభంలోనే ఎవరోనటకుడు వచ్చి చెప్పేడు- "సామాన్యంగా కవిగారు వచ్చి డైరెక్టుచేయగా ఆడడం మా పద్ధతిగాని, ప్రస్తుతం వారికి శరీరంలో అస్వస్థతగా ఉండడంవల్లనూ, అన్ననాటికి ఎన్ని అవాంతరాలువచ్చినా నాటకం ఆడితీరాలి అన్నది మా ప్రధాన నియమంకావడంవల్లనూ మేము నాటకం ఆపుచేయకుండా ఆడుతున్నాం. ప్రశాంతంగా ఉండి, మధ్య మధ్యను పాతఅలవాటుచొప్పున వన్సుమోరులనకుండా ఉండవలసిందని మాప్రార్థన."

ఇంటికి వస్తుంటే దారిలో నడక దానంతటదే తొందరయింది. మనస్సుకూడా ఒక్కమారు ఈపదేళ్ల అనుభవాల నీరసాన్ని చిరిగిన కోటులా విడిచి, అతి ఉత్సాహవంతమై ఉద్రేకభరితమై పనిచేయసాగింది. ఆలోపల్లోపలిప్రవాహంతో సంబంధం లేని వెలుపలి మనస్సు, నాటకం రెండవ అంకం ఆరంభంలో నాయిక పాడిన 'మనసుకే కనుగప్పి, మభ్యపరచ ఫలిత మేమి?' అన్నపాటను ఈలపాట పాడిస్తూంది. ఆవిధంగా ఒక యాభైగజాలు నడిచేవరకూ తనవంటి తగుమనిషి అంత రాత్రప్పుడు రోడ్డుమీద ఈలపాటపాడడం అసందర్భం అన్నవిషయాన్ని గుర్తించలేకపోయింది అతని మొత్తం మనసు.

పాట మానిన దగ్గరనుంచీ అడుగులు మరీ తొందరగా పడసాగాయి.

ఇంకా తను రెండిళ్ల అవతల ఉండగానే పెంపుడు కుక్క 'మేరీ' లేచి, అట్టే గొడవచెయ్యకుండా నెమ్మదయిన గొంతుతో పలకరించింది. ఇంతరాత్రప్పుడు తను ఎక్కడికీ వెళ్లడం, రావడం దానికి అలవాటయిన సంగతి కాదు. అందువల్ల తను తిరిగివచ్చే పర్యంతమూ అది మేలుకొనే ఉంది కాబోలు.

మెళ్లెక్కుతూ ఉంటే నౌఖరు సీతన్నకి తెలివి వచ్చింది. 'బాబొచ్చినారా?' అన్నాడు.

సామాన్యంగా వీథిలోంచి రాగానే మేరీతోనూ, సీతన్నతోనూ ఏవో కబుర్లుచెప్తూ కాలక్షేపం చెయ్యడం అదివరకు మామూలయినపద్ధతి. కాని నాడు మాత్రం చాలా రాత్రయిందని కారణం చెప్పుకొని, ఏమీ మాట్లాడకుండా బట్టలు మార్చుకొని, మంచినీళ్లు తాగి, డాబామీదికి వెళ్లిపోయేడు. బాబుగారికి బాగా నిద్రవస్తూన్నది కాబోలు, ఏమీ మాట్లాడలేదనుకొన్నారు మేరీ, సీతన్నాను. కొద్దిసేపటిలో సీతన్న గుఱ్ఱుపెట్టసాగాడు. ఆ అలవాటయిన శబ్దపు లాలిపాటతో మేరీకి కూడా నిద్రవచ్చింది.

కాని సన్యాసిరావుకు మాత్రం నిద్రపట్టే సూచనలేమీ కనబడలేదు. ఏదయినా పుస్తకంతీసి చదివితే నిద్రవస్తుందేమో నని దీపం పెద్దది చేసేడు. కాని టేబిలుమీదనూ షెల్ఫులోనూ ఉన్న పుస్తకాలలో ఏదీ మనస్సును అరికట్టగలిగేది ఉన్నట్టు రూపించలేదు. మళ్లీ దీపం తగ్గించి, గట్టిగా కళ్లుమూసుకొని, తనను నిద్రకు దూరం చేస్తున్న ఆలోచనలను అరికట్టాలని, ఒకటి రెండు మూడు నాలుగు అని లెక్కపెట్టసాగాడు. కాని నలభైఅయిదుప్రాంతంలో సూత్రం తెగిపోయి, నాటకం నాలుగవ అంకంలోని సంఘటనలలో తానయితే ఏవిధంగా వ్యవహరించేవాడు అన్న ఆలోచనలోకి దూకింది మనస్సు. కొంతసేపటికి, ఇప్పుడీ గొడవ ఎందుకు, అనవసరం, నిద్రపోవడం మంచిదని, మళ్ళీ తన అంకెల లెక్క మొదలుపెట్టేడు. కాని, ఫలితం ఎప్పటిదే. సగంలో వరస తెగిపోవడమూ, ఏదో రావద్దనుకొన్న ఆలోచన మనఃప్రతిసీరమీద ప్రతిఫలించడమున్నూ. నిద్రకోసమని చేసే ఈవిధమయిన నిష్ఫలప్రయత్నాలతో అటూ ఇటూ మంచంమీద దొర్లుతూ సుమారు ఒకగంట గడిచిన తరవాత, తనలోని నాటకాన్ని గూర్చిన ఒక క్రమాన్ని అనుసరించని అభిప్రాయాలే ఈ యావదశాంతికీ కారణ మని, లేచి, వెంటనే తన అభిప్రాయాలు మిత్రుడు సత్యనారాయణకు తెలియజేస్తే కాస్త తృప్తిగా ఉంటుందని మళ్లా దీపం పెద్దదిచేసి, కాగితం కలం తీసి ఆరంభించేడు.

ఒకప్పుడు విద్యార్థిదశలో నాలుగుసంవత్సరాలు జన్మజన్మాలకూ విడదు మన స్నేహం అన్నట్టుగా ఉండి, తరవాత సుమారు ఒక పుష్కరంకాలం కలుసుకోకుండా, ఉత్తరాలయినా రాసుకోకుండా ఉన్న మిత్రులలో, హఠాత్తుగా ఒకరు రెండవవారికి ఉత్తరం రాయాలంటే ఎన్నెన్నో అనుమానాలు వస్తాయి ఎంతటివారికయినా. ఏది రాసినా ఎంతో పేలవంగానూ, అతి సామాన్యవ్యావహారికపద్ధతికి అనుగుణంగానూ మాత్రమే రూపిస్తుంది. కాని, రాయా లనుకొన్న తరవాత మాత్రం ఊరుకొందుకు మనస్కరించదు. నాలుగయిదు కాగితాలమీద కొద్దికొద్దిగా రాసి, అసలు ఆరంభమే ఇష్టపడక చిత్తుకాగితాల డొక్కులో పడేసి, ఇక నిది కాదని, ముందు, నిష్పాక్షికంగా, ఏమీ సంబంధంలేని విమర్శకుడు రాసినట్లుగా 'సంప్రదాయం' నాటకం మీది తన అభిప్రాయాల్ని రాసి, అందుతో కలిపి, సత్యనారాయణను ప్రశంసిస్తూ, పూర్వమైత్రిని జ్ఞాపకం చేస్తూ ఒక చిన్న ఉత్తరం రాయాలనుకొని, విమర్శన ఆరంభించేడు.

సన్యాసిరావు ఉత్తరం రాయడం అంటే, అలా కొంతసేపు విసుగుకోకుండా రాస్తే సాంతంచేసేవాడేమోగాని, విమర్శన రాయడం ఆరంభించడంతో

మరీ చిక్కయిపోయింది. ఒక చిన్న సంగతి చెప్పాలని ఒక వాక్యం రాసేసరికల్లా, అందుకు ప్రతికూలంగా ఎన్నెన్నో ఉద్దేశాలు అహమహమికాభావంతో పొడుచుకొని రాసాగాయి. తనకు లోలోపల అనుమానానికి తావు లేకుండా నిశ్చయంగా ఉంటున్నట్టు అదివరకు తోచిన విషయాలే, కాగితంమీదికి వచ్చేసరికల్లా ఏమిటో తనకు తెలియని, తన ఇష్టంతో అట్టే సహకరించని కొత్త సంగతులలాగే కనిపించసాగేయి.

కావాలని ప్రయత్నం చేసినంతసేపూ రాకపోయినా, అతని విమర్శనా, ఉత్తరమూ పూర్తి కాకుండానే నిద్ర వచ్చింది. ఎలా కుర్చీలోంచి లేచి వెళ్లి మంచంమీద పడుకొన్నాడో అతని కేమీ తెలీదు.

రోజూ ఉదయం సీతన్న వేణ్ణీళ్లు కాగబెట్టి, లేపేపర్యంతం లేవడం అలవాటు లేని సన్యాసిరావు ఆ రోజున, అందులోనూ తొలినాటిరాత్రి సరిగా నిద్ర లేకపోయికూడా అంత వేగంగా లేచి ఉండడం సీతన్నకు ఆశ్చర్యం కలిగించింది.

అతిత్వరగా స్నానం ముగించేసుకొని, సీతన్న కాఫీ తెచ్చేలోపున, శెలవర్జీ రాసేసి, "సీతన్నా, తక్కిన పనులు తరవాత చేద్దువుగానిలే, ముందిది పట్టుకొనివెళ్లి రంగనాథం (ఆఫీసరు)గారి కిచ్చేసిరా" అన్నాడు.

కొన్ని సంవత్సరాలుగా ఏడాదికి రెండుమార్లు తద్దినాలకు తప్ప శెలవుపెట్టని సన్యాసిరావు శెలవు పెట్టడం సీతన్నకు ఏమీ బోధపడలేదు. ఆరోజు ఏమీ తద్దినంరోజు కాదే. రెండు తద్దినాలూ చైత్రమాసంలో వారంరోజుల వ్యత్యాసంతో వస్తాయి. వాటికి ముందు చాలా ప్రయత్నం చేస్తారు బాబుగారు. వంటబ్రాహ్మణ్ణి తెప్పించడం, బజారుసామాన్లు తేవడం మొదలయిన తంతు చాలా ఉంది. కాక, కాఫీ తాగేసేరు కూడా. ఏమో వంట్లో బాగుండడంలేదేమో! మామూలుగా ఉన్నట్లే ఉన్నారే......ఆ యీ అనుమానా లన్నీ ఆ ఒక్క క్షణంలోనూ సీతన్న మొగంలో ద్యోతక మయేయి.

"మ రేం చికాకు లేదు సీతన్నా. వెళ్లి అది ఇచ్చేసిరా. ఇవాళ ఏమిటో ఆఫీసుకు వెళ్లా లని లేదు. కాక, వేరే కొంత చెయ్యవలసిన పని ఉందిలే. దార్లో వస్తున్నప్పుడు హోటలులో భోజనం మామూలుగా తొమ్మిదిగంటలకు కాకుండా పదకొండుగంటలకు పంపమని చెప్పడం, ఒక నాలుగు ఇడ్లెన్లు, ఒకదోసె, రెండు కిళ్లీలు తీసుకొనిరావడం చెయ్యాలి. ఇంద, రూపాయి. ఆఁ, దారిలో పోస్టాఫీసులో ఒక రెండు కవర్లు కూడా తీసుకొనిరా, వెళ్లు" అని, అదివరకే తను టేబిలుమీద తీసిఉంచిన ఫైల్సు తిరగవెయ్యడంలో పడ్డాడు.

ఉత్తరాలన్నీ ఒక గుత్తళం (ఫైలు); మనియార్డరురసీదులన్నీ ఇంకొక ఫైలు. తన జాగ్రత్తకు తనకే ఆశ్చర్యం వేసింది సన్యాసిరావుకు. మొదట్లో సత్యవతి ఒక ఆరు నెలలు మనియార్డర్లు తీసుకోలేదు. అవన్నీ తిరిగివస్తే తానే సంతకంచేసి తీసుకొన్నాడు. అదే ఇంకొక డెవడయినా అయితేనా ఆకారణం చెప్పకొని తరవాత డబ్బు పంపడం మానివేసి ఉండును. తానుకాబట్టి...తరవాత ఒకపది సత్యవతిసంతకాలతోనే ఉన్నాయి. అక్కడనుండీ, ఆమె తనతరఫున తీసుకోవచ్చని చెప్పింది కాబోలు, బావమరది వెంకట్రావు సంతకాలతోనే ఉన్నాయి తక్కిన రసీదులన్నీని. అలా కొంతసేపు కొత్తగా అక్షరాలు చదవడం నేర్చుకొన్న కుఱ్ఱవాడు ఎదురుగా కనిపించినవన్నీ చదవడానికి ప్రయత్నించినట్లుగా చదవసాగేడు పోస్టుముద్రలనూ, తను రాసిన విలాసాలనున్నూ. ఇన్ని సంవత్సరాలు నెలకొకటిచొప్పున రాసిన కాగితాలలో కూడా తన దస్తూరీగాని, ఉపయోగించిన సిరాగాని ఏమీ మారకపోవడాన్ని గమనించి గమనించి, ఇకమరి ఆలస్యం చెయ్యడం లాభంలేదని ఉత్తరాల ఫైలు తీసేడు. మొదట్లో అతని ఉద్దేశం సీతన్న తిరిగివచ్చే పర్యంతమూ ఏదో కాలక్షేపం చేసి, అప్పుడు టిఫిను తిని, స్తిమితంగా మధ్యాహ్నం భోజనంవేళ అయేవరకూ ఉత్తరాలు చదువుకొంటూ కూర్చోవాలని. కాని, అంతసేపు ఆగలేకపోయేడు.

ఒకమారు ఉత్తరాలు చదవడం ఆరంభం అయినతరవాత, అతనికి మరి తనచుట్టూ ఉన్న ప్రపంచంతో సంబంధం లేకపోయింది.

ఒక గంటసేపు టేబిలుమీద టిఫిను పడి ఉన్నతరవాత, సీతన్న మళ్లీ మళ్లీజ్ఞాపకం చెయ్యగా, విసుక్కొంటూ, ఎడంచేత్తో ఉత్తరం పట్టుకొని చదువుతూనే, కొద్దిగా తిని అయిందనిపించుకొని, కిళ్లీలు

రెండూ ఒక్కమారే వేసుకొని, మళ్లీ తనలోకంలో పడ్డాడు.

మధ్యాహ్నం భోజనం సంగతీ అంతే. పదకొండుగంటలకు తెచ్చిపెట్టినది ఒంటిగంటవరకూ ముట్టుకోలేదు. అప్పుడయినా సీతన్న తొందరచేయడం వల్లనే. మేరీకూడా ఇంతవరకు ఆకలితో ఉండిపోయిందే అనుకొంటూ, అప్పుడు ఏదో కూర్చొని, కొద్దిగా తిని, ఆ చల్లారిన మెతుకులు సహించలేదనీ, అసలు వంటకాలు ఏమీ బాగా లేవనీ లేచిపోయి వెంటనే బాగా స్ట్రాంగు కాఫీ పెట్టమన్నాడు సీతన్నను. అతనివైఖరి ఒక్క సీతన్నకే కాదు, మేరీకి కూడా వింతగానే కనిపించసాగింది. రోజూ ఉదయం లేచినదగ్గరనుంచి ఆఫీసువేళ పర్యంతమూ తనతోనే కాలక్షేపం చేసే యజమాని, ఈరోజున తనవంక చూడనయినా లేదు. పైగా తను ఆమాత్రం ఈమాత్రం దగ్గరకు వెళ్లి, నెమ్మదిగా తన రాకను తెలియజేసినా ఏమీ పరికించడం లేదు. చూసి చూసి, ఏమిటిదంతా, నీకేమయినా తెలుసునా అన్నట్లు మొగంపెట్టి, సీతన్న దగ్గరికి వెళ్లి, వాడివెనకాతల కొంతసేపు తిరిగి, వాడు కొంతసేపటికి ఏమీ తోచక కూర్చొని, చుట్ట తరవాత చుట్టచొప్పున కాలుస్తూ ఉంటే, తానూ ఆ పొగ చూస్తూ వాడి కాళ్లదగ్గిర మెదలకుండా కూర్చుంది. వాడుగాని లేచి బాబుగారి గది దగ్గరకు వెళ్తే, తానూ వాడి వెనకాతలే వెళ్లేది. బాబుగారు చూస్తున్న కాగితాలలో ఏముందో, ఎందుకు ఆయన మధ్యమధ్యను లేచి కాగితాలు చేత్తో పట్టుకొని అటూ ఇటూ పచారు చేస్తున్నారో, ఒకొక్కప్పుడు కదలకుండా నిలబడి గట్టిగా కళ్లుమూసుకొంటున్నారో సీతన్నకే దురవగాహంగా ఉంది. వాణ్ణి ఆశ్రయించుకొని ఉన్న మేరీకి ఎంత తెలుసునో ఊహించడం కష్టమే; కాని మొత్తంమీద, బాబుగారి అశాంతి కేవలం తమమీద కోపం కాదనీ, వేరే ఏదోకారణంవల్ల పుట్టినదనీ ఇద్దరికీ స్వభావసిద్ధమయిన విశ్వాసం ఉంది.

అలా కొంతసేపు చదవగా చదవగా సన్యాసిరావుకు ఒక కొత్తవిషయం స్ఫురించింది. ఇన్ని ఉత్తరాలలోనూ ఒకదానిమీదా రాసిన ఊరిపేరుగాని, తేదీగాని లేదు. తానయితే వచ్చిన ఉత్తరాలన్నీ, అప్పటి ఉద్రేకాన్నిబట్టి చదివినా చదవకపోయినా, ఒకవరసను ఫైలుచేసేడు. ఇటీవల, అంటే ఏమిటి, సుమారు నాలుగేళ్లయింది ఇవీ రావడం మానేసేయి. రాసి రాసి నిరాశ చేసుకొని రాయడం మానేసింది కాబోలు. తానూ, నెలజీతం తీసుకోగానే, అలవాటుచొప్పున మనియార్డరుచేయడం తప్పిస్తే, ఉత్తరాలు రావడం ఆగిపోయి ఇంత కాలం అయిందని ఇన్నాళ్లూ గుర్తించనేలేదు. తన ప్రస్తుత జీవితంలో ఆఫీసువ్యవహారాలకు సంబంధించిన ఎక్కువ పని ఉండే రోజులూ తక్కువపని ఉండే రోజులూ అనితప్ప, వ్యక్తిగతంగా తనకు అన్నిరోజులూ ఒక్కటే. నెలలూ సంవత్సరాలూ గడిచినా అణుమాత్రం భేదంలేని దయిపోయింది తన జీవితం!

ఇప్పుడీ ఉత్తరాలన్నీ తేదీలు లేకుండా ఉన్నాయికదా, ఈ వరుస తప్పించేసి కలగాపులగం చేస్తే, మళ్లీ తాను సక్రమంగా పేర్చగలడా? ఏమో, ప్రయత్నించి చూడవలసిందే. ఎవరూ తోడు లేని మనిషి, పేకముక్కలు ముందు పడేసుకొని తాత్కాలికంగా ఏదో ఒక కొత్త ఆటను సృష్టించుకొన్నట్లు, అతను ఉత్తరాలన్నీ ఫైలులోనుండి తీసి రాశిగా టేబిలుమీద పడేశాడు. ఇదివరకు చదవడం కేవలం చదవడమే. ఇప్పుడలాగ కాదు. చదివిన ప్రతిఉత్తరం సుమారు ఏ సంవత్సరములో వచ్చిందో ముందు నిర్ణయించాలి. తరవాత దేనితరవాత ఏది వచ్చిందో తేల్చుకోవాలి.

అందుకు ఉపక్రమణికగా గుడ్డివాడు కంటితో చూసి ఆనందించలేని డబ్బును చేతితో తడిమి చూసుకొని తృప్తిపడినట్లుగా, అన్ని ఉత్తరాలూ ఒక్కమారు అటూ ఇటూ కలిపి, గట్టిగా కళ్లు మూసుకొని, కుర్చీలో వెనక్కి చేరగిలబడ్డాడు.

కొంతసేపు అలా కూర్చున్నతరవాత కళ్లు విప్పి, ఏమీ ఎంపిక చెయ్యకుండా, చేతికి ఏది వస్తే అది అన్నట్లుగా ఒక ఉత్తరం తీసి, చదివిన ఉత్తరాలన్నీ సక్రమంగా పెట్టడానికి టేబిలుమీది ముందుభాగం అంతా ఖాళీచేసి చదవడం మొదలుపెట్టేడు.

"ప్రియమయిన రావుగారికి, మీ సత్యవతి అనేక నమస్కారములు చేసి వ్రాయునది :—

క్రిందటిమారు నేను రాసిన ఉత్తరానికైనా జవాబు ఇస్తారనుకొన్నాను. కాని, ఆతరవాత ఇప్పటి కప్పుడే పోస్టుమేన్ ఈ ఊరు వారానికి రెండుమార్లు చొప్పున ఏడుమార్లు వచ్చేడు. అంటే దాదాపు నెల అయిందన్నమాట. మీకు నాయెడల దయకలిగివుంటే

ఈసరికే ప్రత్యుత్తరం రాసివుండురు. లేకపోయినా మళ్లీ ఉత్తరం రాసి శ్రమకలిగిస్తున్నందుకు మరింత కోపం రాకుండాఉంచేచాలును.

క్రిందటిమారు పోస్ట్ మేన్ వచ్చినప్పుడే మళ్లీ మనియార్డరు పట్టుకొని వచ్చేడు. ఆ మూలంగానయినా నన్ను జ్ఞాపకం ఉంచుకొన్నందుకు సంతోషమే. అయితే, ఎప్పటిలాగే తిరగగొట్టడం జరిగింది.

మీకు నేనంటే అంత అసహ్యంగా ఉండి, అథమం ఒక ఉత్తరం రాయడానికయినా ఇష్టం లేకుండా ఉన్నప్పుడు నాకు డబ్బుమాత్రం ఎందుకు పంపాలీ ? ఇదొక్కటే మీ విధి అంటారా ? అదేమో నాకు అర్థం కాదు.

నేను ఎలాగా పుచ్చుకోకపోయేదానికి నెల నెలా మీకు పంపడంశ్రమ ఎందుకు ? అయితే ఒకటి - అతనిలో ఏమీ లేదు, ఇదే తెలివి తక్కువది, మొగుణ్ణి విడిచి వచ్చేసింది; అయినా అతను - ఆ ధర్మరాజు ప్రతినెలా డబ్బు పంపిస్తున్నా డనిపించు కోవాలంటే, పంపించండి. అందువలన నాకా ఉపయోగం లేదు. మీకా శ్రమ. ఇలా పంపేకంటె, మీకంటే నామీద దయ లేదు గాని, నాకు మీరుతప్ప నిజంగా నా అనేవా రెవరున్నారు చెప్పండి? ఎప్పుడయినా అవసరంవస్తే నేనే రాస్తాను. అప్పుడు పంపవచ్చు.

ఎప్పటికయినా మీకు మళ్లీ నామీద దయ వస్తుందేమో నన్న ఆశతో బ్రతికిఉంటున్నాను.

ఇట్లు

మీ సత్యవతి"

చివరి వాక్యమూ, 'నాకు మీరుతప్ప నిజంగా నా అనే వా రెవరున్నారు చెప్పండి' అనే వాక్యమూ చదువుతూఉంటే, సన్యాసిరావుకు కళ్లలో నీళ్లు కమ్మేయి. బైటికి చదవకపోయినా గొంతు డగ్గుత్తికపడినట్లయింది. అప్పుడు ఆ ఉత్తరంఅందినవెంటనే తనలో కలిగిన భావాలన్నీ మళ్లీ ఒక్కమారుగా కురిసేయి మనోయవనికమీద. వెధవ ఒంటరిజీవితం తనకుమాత్రం ఏమి బాగుందిగనక. వెళ్లి తన సత్యవతిని తాను తెచ్చేసుకొంటాడు. గుడ్డిలోకం ఏమనుకొంటే అనుకోనీ, తన కేం లక్ష్యం ? ఎట్టఎదురుగా తనకు కనిపించే సౌఖ్యాన్ని విడిచిపెట్టుకొని, ఎక్కడో ఎవళ్లో తన వెనకాతల మాట లనుకొంటా రని తా నెందుకు భయపడాలీ ?.........అనుకున్నా డేగాని, తన మనస్సును, సౌఖ్యాన్ని తానే నమ్మలేకపోయేడు. అప్పట్లో, పైగా, తక్కిన లోకమే కాదు, సత్యవతే తనను ఓడిపోయినవాడికింద లెక్కకడుతుందేమో నని అప్పటి రోజుల్లో తన భయం.

ఆ భయమే ఇంత చేసింది. తను ఒకింత ఓడిపోయినట్లు ఒప్పుకొన్నంతలో తనకు శాశ్వతంగా జరగబోయే దేముంది ? ఆమె ఒకమాటు కాదు, ఇన్నిమాట్లు ఇంత విస్పష్టంగా ఒప్పుకొంటున్నదే తన ఓటమిని, పొరపాటును! అయినా తాను క్షమించలేకపోయేడు. కాని, ఇది క్షమించడానికి వీలైన పొరపాటా ? ఏమి, ఎందువల్ల కాకూడదు ? కొంతకాలం సంసారం చేసి, వైధవ్యం పొందిన స్త్రీలు మళ్లీ వివాహం చేసుకోవడం సభ్యమయిన ఈరోజుల్లో ఒక్కమారు పొరపాటుపడిన మనిషి, చిత్తస్ఫూర్తిగా ఇంతగా పరితపిస్తూఉంటే, తిరుగా పరిగ్రహించడంలో ఉన్న దోష మేమిటి ?

మరి ఆలోచన వేడిని భరించలేక, "అయితే ఇది మొట్టమొదటి ఆరునెలల్లోనూ చివ్వరిమారు డబ్బు పంపవద్దని రాసిన ఉత్తరంఅన్నమాట" అనుకొని టేబిలు మీద ఒకచివరనుంచి కొంత స్థలం విడిచిపెట్టి, ఆ ఉత్తరం పెట్టి, ఏదో తప్పనిసరివిధి అన్నట్లు ఇంకొకటి తీసేడు.

"ప్రియమయిన రావుగారికి, సత్యవతి అనేక నమస్కారములు చేసి వ్రాయునది :—

ఈవాళకి సరిగా మన పెళ్లి అయి ఆరేళ్లవుతున్నది. కాని, ఇంకా నాకుమాత్రం నిన్ననో మొన్ననో అన్నంత స్పష్టంగా అన్ని సంగతులూ జ్ఞాపకం ఉన్నాయి. నిజంగా అలాగే అయిఉంటే ఏ గొప్పమార్పువల్లనో ఈ ఆరేళ్లూ అసలు మధ్యను లేకుండాపోతే ! కొత్తగా ఒకరినొకరం పిల్చుకొందుకే కాదు, బాగా తేరిపారచూసుకొందుకుకూడా మొగమాటపడడమూ, ఏ ఒకమాటఅంటే అవతలివారికి ఎల్లా ఉంటుందో అన్నట్లు సంకోచిస్తూ ప్రతిఒకపనీ రెండవవారి తృప్తికోసంమాత్రమే చేస్తూ, మధ్యమధ్యను వచ్చే కొద్దిగంటలఎడబాటునూ ఎన్నోయుగాలన్నట్లుగా బాధపడుతూ గడిపిన ఆరోజులు ఎంత తియ్యటివి ?

ఇన్ని అంతులేని సంవత్సరాలు బ్రతకవలసిన మన జీవితాలలో అటువంటి తియ్యని హాయనిపించే రోజులు అంత కొద్దిగామాత్రమే ఎందుకున్నాయో. నన్నుబట్టే లోకం అంతా నాలాగే ఉందనుకొంటున్నాను. అందరూ నావంటి దురదృష్టవంతులెందుకవుతారు? అందరి బ్రతుకులూ హాయిగానే ఉండవచ్చును. నేను ఒక్కతెనే నోచి పుట్టలేదు.

ఇదివరకల్లా కొంత ఆశ ఉండేది—అభిమానం వచ్చో, కోపం తెచ్చుకునో, ఉత్తరం రాస్తారని. ఇప్పుడు ఆ ఆశ అంతరించిపోయింది. ఎందుకు నేను ఇంకా బ్రతికి ఉంటున్నానో, ఎన్నాళ్ళీవిధంగా బ్రతికిఉండగలనో నాకే తెలియదు.

మామూలురోజుల్లోనయినా పుణ్యస్మరణ మంచిదంటారు. అందులో, ఈరోజు సరిగ్గా ఆరేళ్ళక్రిందట మన పెళ్ళిఅయిన పర్వదినము. అందుకని, రాత్రి పడుకోబోయేముందు మిమ్మల్నీ భగవంతుణ్ణీ స్మరించుకొంటున్నాను. ఇది నా తెలివితక్కువ అని మీరు నవ్వినా సరే, నిజమే.

అకస్మాత్తుగా మీకు నామీద దయ కలిగినట్లుగా ఇప్పటికీ పెళ్ళికలలు కనడం మానలేని,

మీ సత్యవతి"

ఇది చదివినతరవాత ఇందాకటి ఉత్తరం చదివినవెనక చేయగలిగినపాటి ఆలోచన కూడా అతని మనస్సు చేయలేకపోయింది. ఉత్తరం ఎప్పటిదయి ఉంటుందో ఊహించకమునుపే దుర్బలంగా టేబిలు మీద పడిపోయింది.

అప్రయత్నంగా అతని చేయి ఉత్తరాల రాశిలోనించి ఇంకొకటి తీసింది. మొదట కొన్ని పంక్తులు చదివేవరకూ అతనికి ఏమి చదువుతున్నదీ అర్థం కాలేదు.

"మీకు అంతగా కోపం ఉంటే, నన్ను శిక్షించడమే మీ ఆనందమయితే, ఇలా నలుగురికీ తెలిసే, ఈవిధంగా ఎందుకు హింసించడం? మీదగ్గరే ఉంచుకొని, పైవాళ్ళకు తెలియకుండా శిక్షించండి. చిన్నప్పుడు కథలలో విన్నట్లుగా, కావాలంటే రోజు కిన్ని దెబ్బలు అని కొట్టండి, కిక్కురుమనకుండా భరిస్తాను. అంతేకాని ఈ అవమానం భరించలేను. మీకు నామీద మరి ఎన్నటికీ క్షమించబడని ఆగ్రహం ఉంటే, ఈ విధంగా నన్ను దూరంగా ఉంచి ప్రతినెలా నా కక్కర్లేకపోయినా మనియార్డర్లు చేస్తూఉండడమూ ఇదంతా ఎందుకు? నన్ను మీదగ్గరకు పిలిపించుకొని, విషం పుచ్చుకోమన్నా సంతోషంతో, నా అంతట నేనే పుచ్చుకొన్నానని ఉత్తరం రాసి మరీ పుచ్చుకోగలను.

లేదా, నా ఆఖరి కోరిక! మీరు నన్ను పూర్తిగా క్షమించేరనీ, మనం ఇద్దరం మళ్లీ ఒక్క రోజయినా కలిసి ఉన్నామనీ తృప్తి లేకుండానే చచ్చిపోవాలి.

నా ఈ ఒక్క కోరికా తీర్చరూ?

మీ సత్యవతి"

ఉత్తరం చదివీచదవడంతో యంత్రంలాగ ఇంకొకటి తీసేడు. తీయడంతోనే రెండవ పేజీ వచ్చింది. కలం లేదు కాబోలు; కాగితాలూ బాగా లేవు. చిన్నపిల్లల పుస్తకాలకు అట్టలుగా ఉపయోగించే కాగితంమీద కాపీయింగుపెన్సిలుతో రాయబడి ఉంది. ఇది ఒకటే కాదు, ఇటువంటివే తక్కిన ఉత్తరాలు కూడా చాలాభాగం.

"నాకు మరి ఎలాగూ ఆశ లేదు. ఇంతే. ఈ బ్రతుకిలా వెళ్ళమారవలసిందే.

కాని, మీ కెందుకనవసరపు ఒంటరితనం? నాకు మొన్నటి వరలక్ష్మీవ్రతంనాటికి ఇరవై ఆరేళ్లు నిండేయి. అంటే మీకు ఇరవైతొమ్మిదినెల్లి ముప్పై వస్తుంది మరొక నెల్లాళ్ళలో. అంటే ఇప్పటికాలంలో కొందరు మొట్టమొదటి పెళ్లి చేసుకునే వయస్సే. మీరు మళ్లీ పెళ్లి ఎందుకు చేసుకోకూడదు?"

అలా చదువుతూండగా జ్ఞాపకం వచ్చింది. ఆ వేళ తను హెడ్‌క్లర్కు అయిన రోజు. ఉత్తరం చదివి, ఆఫీసు అవగానే అలాగే బయలుదేరి వెళ్లిపోవాలనుకొన్నాడు సత్యవతిని తీసుకొనిరావడానికి. కాని,

హుఁ, వెధవగుండెనిబ్బరం చాలింది కాదు. తీరా స్టేషనకు వెళ్లి కూడా ఏవో పత్రికలూ పుస్తకాలూ కొనుక్కొని తిరిగివచ్చేడు తన ఎడారిఇంటికి. ఛ, ఈమనస్సుకు తనలో తనకే తగని మొగమాటమూ, అనుమానమున్నూ.

ఆతరవాత మరి రెండో మూడో ఉత్తరాలు వచ్చేయి. అవి, ఏవో రాయకతప్పదని రాసినట్లుగా ఉన్నాయి. అవును పాపం, తనదగ్గరనుండి ముచ్చటకయినా సమాధానం లేకుండా సంవత్సరాలతరబడిని ఎంతకని ఆమె రాయగలదు! తానే మూర్ఖుడు. ఆమెను గూర్చిన సానుభూతి లేకపోవడమే కాదు, తన సుఖాన్ని కూడా తాను తెలుసుకోలేకపోయేడు. ఊరికేనే ఉద్రేకంలో తనను భగవానుడు శ్రీరాముడితోపోల్చుకోగానే సరా? తనకేమీ ప్రజాభిప్రాయాన్ని మన్నించితీరాలన్న నిర్బంధం లేదే. కాక తాను ఆదర్శపురుషుడు కాడే. హుఁ, అంతే, ఒకళ్ల వని లాభం లేదు. ఎవళ్ల కష్టసుఖాలకు వాళ్లే చాలావరకు బాధ్యులు.

ఆవేళేగాని వెళ్లి సత్యవతిని తెచ్చుకొనిఉంటే, ఇవాళకి నాలుగేళ్లుపైనయింది, ఈసరికి అదృష్టం ఉండిఉంటే, ఇద్దరు పిల్లలు కలిగిఉందురు. తన ఇల్లు ఈవిధమయిన నిర్జీవపువాసన కొడుతూకాక, పిల్లల కేరింతాలతో, ఆటలతో నిండుగా కలకలలాడుతూ ఉండిఉండేది.........సత్యవతే కాదు, తానూ అసలు దురదృష్టవంతుడు. ఆమెకు తన అన్నదమ్ముల పిల్లలయినా చేరదీసి పెంచే అదృష్టం లభించింది. తనకు ఉన్నవల్లా ఆఫీసుకుర్చీ, టేబిలూ, ఫైల్సూ, మేరీ మాత్రమే. సీతన్నకయినా ఒక ఇల్లంటూ ఉంది. పెళ్లాం పోయినా కూతురుంది. ఆమె పిల్లలున్నారు, ఇంటికి వెళ్లేసరికి తాతా తాతా అంటూ చుట్టుముట్టడానికి. తనకు సజీవమయిన అటువంటి ఆస్తి ఏమీలేదు. ఆఫీసులోని పుస్తకాలూ అంకెలూమాత్రమే తనకు సంబంధించినవి. ఇంట్లోని పుస్తకాలన్నీ ఎక్కడెక్కడి యథార్థమానవులకో, ఊహాకల్పితవ్యక్తులకో సంబంధించినవే—అవే తనకు తోడునీడలు. ఒకప్పుడు నిత్యజీవితంలో కనిపించే మనుష్యులకంటె, సాహిత్యజగత్తులోని వ్యక్తులే ఎక్కువగా స్నేహపాత్రులని అతడు మనసా విశ్వసించకపోలేదు. కాని, ప్రస్తుతపు నిరుత్సాహప్రవాహజలంతో ఆ పూర్వపు విశ్వాసాశ్రయం సమూలం కొట్టుకొనిపోయింది.

మరి ఉత్తరాలు తియ్యడానికి కష్టమనిపించింది. సగం కళ్లుమూసుకొనే వెళ్లి మంచంమీద పడుకొన్నాడు. అట్టే ప్రయత్నం అక్కరలేకుండానే బాగా నిద్రపట్టింది సాయంకాలం నాలుగుగంటల ప్రాంతంలో. ఆ పడుకోవడం రాత్రి ఎనిమిదిన్నరప్పుడు లేపితే ఏమంటారో అని బితుకుబితుకుమంటూ సీతన్న లేపేపర్యంతమూ తెలివి రాలేదు. లేచి, భోంచేసి వెంటనే మళ్లీ పడుకొన్నాడు.

సీతన్నకూ, మేరీకీ ప్రాణాలు కుదుటపడ్డాయి-బాబుగారికి మరేమీ పెద్ద చికాకు లేదు, మళ్లీ మామూలుగానే అవుతున్నారని.

(సశేషము)

# చివరి అంకం

[కథానిక]

(గత సంచిక తరువాయి)

●

శ్రీ పంతుల శ్రీరామశాస్త్రి

మర్నాడు ఉదయం సీతన్న లేచేపర్యంతమూ లేవలేదు సన్యాసిరావు. సరే, అంతా బాగానే ఉంది, నిన్నను ఒక్కరోజూ ఏదో కారణంచేత మార్పు వచ్చినదిగాని, ఇక మళ్లీ ఎప్పటిలాగే అంతా జరుగుతుం దని నిబ్బరంపడుతున్న సమయంలో తొలినాటికంటే వింతయిన సంగతి వినవలసివచ్చింది సీతన్నకు.

“సీతన్నా, ఇవాళా నిన్నటిలాగ మళ్లీ శెలవర్జీ పట్టుకెళ్లి ఇచ్చెయ్యాలి. వస్తే రేపు సాయింత్రానికే తిరిగివస్తాను. కాని, ఎంచేతయినా ఆలస్యం అయితే కావచ్చును; కాక - తిరిగివచ్చిన మర్నాడే ఆఫీసుకు వెళ్ళడం చికాకుగా ఉండొచ్చును. అంచేత ఒక వారం అంతా శెలవు పెట్టేసేను. ఇది ఇచ్చేసి నువ్వు మళ్లా వేగం తిరిగిరావాలి. హోటలునించి భోజనం తొమ్మిదిలోపుగా వచ్చెయ్యా లని చెప్పాలి. ఈ పదిన్నర గంటల బండికే ప్రయాణం. నేను తిరిగివచ్చే దాకా నువ్వు ఇంట్లోనే ఉండు. నీ భోజనం ఇక్కడికే నీ మనమరాలిచేత పంపించమని చెప్పు.”

తరువాత బాబుగారు జట్కాలో ఎక్కేవరకూ సీతన్నకు ఆలోచనకు సమయమే దొరకలేదు. ఆ వెనుక ఇక తీరికగా ఆలోచించవచ్చును అని ఎంత బుఱ్ఱ చించుకున్నా ఏమీ తాడూ ఒడిసే అందలేదు.

అవతల సన్యాసిరావుపనీ అలాగేఉంది. సవ్యంగా వేళకు వచ్చిన రైలు, ఇక మరొక్క స్టేషన్‌లో తాను దిగిపోతా డనగా రెండు స్టేషనులకూ మధ్య ఏదో గూడ్సుపెట్టెచక్రాలు పట్టాలమీంచి తప్పేయని, అది తీసేపర్యంతం ఒక మూడుగంటలు ఆగిపోయింది. అంతా ఎనిమిదిమైళ్లు. తాను నడిచివెళ్ళినా ఇంతకుముందుగానే వెళ్ళిపోయి ఉండేవాడు.

సరిగ్గా సాయంకాలం నాలుగున్నరకల్లా దిగిపోతే హాయిగా చల్లగాలిలో నడిచివెళ్తే, దీపాలుపెట్టే వేళకు ఊరు చేరుకోగల ననుకున్నాడు. కాని ఈ ఆలస్యం అవడంమూలాన స్టేషనులో దిగేసరికి దగ్గరదగ్గర ఎనిమి దయింది. స్టేషనులో ఏ దుకాణమూ లేదు. అది వరకు పన్నెండేళ్ళక్రితం తాను చూసిన స్థితికీ యిప్పటికీ అట్టే భేదం కనిపించడం లేదు. తనతోపాటు రైలుదిగిన పదిపదిహేనుమందీ దగ్గరదగ్గర ఊళ్ళవాళ్లు కాబోలు, అసలే ఆలస్యం అయిందన్న ఆతృతతో తొందరతొందరగా నడక అందుకొన్నారు. ఒక ఐదు నిమిషాలు స్టేషనుషెడ్డులో నిలబడి ఆలోచించాడు— ఈరాత్రిపూటే వెళ్లడమా, లేక తెల్లవారేవరకూ ఇక్కడపడుకొని అప్పుడు వెళ్లడమా అని.

రైలు అంతసేపు నిలిచిపోయినప్పుడే ఏమిటో తన ప్రయాణం చాలా అసందర్భమయిన దనిపించి, వెనక్కు తిరిగి వెళ్లిపోయే రైలు ఎప్పుడు వస్తుందా అన్న అభిప్రాయం కలిగింది. స్టేషనులోనేగాని తానుండదలచుకొంటే తెల్లవారేలోగా ఏదో రయిలు రావడమూ, తాను అది ఎక్కి తన ఈ ఇంత ప్రయత్నానికీ విరుద్ధంగా ఇంటికి తిరిగి వెళ్లిపోవడమూ జరిగితే జరగవచ్చును.

అయినా దారి తెలియడానికి శుద్ధివెన్నెల లేకపోలేదు. ఇంతకూ ఉన్న మొత్తందూరం ఆరుమైళ్లే. అయితే మధ్యను ఏరు ఎలాగుందో? ఏరు దాటిపోతే

అవతల ఊరు కనిపిస్తూనే ఉంటుంది. ఇదివర కెన్ని మార్లు బండీ ఉన్నా తాను కావాలని ఏటిలో దిగి నడిచేవాడు కాడు? మరేం భయం లేదు. రాత్రంతా, ఇక్కడ పడిఉండడం దేనికి? గబగబ నడిచేస్తే తొమ్మిదిన్నరకల్లా వెళ్ళిపోవచ్చును.

ఇన్నాళ్లూ తాను ఊరికే మొగమాటపడ్డాడు; వెనుకంజవేసేడు; కాని, నేడు తను వేస్తున్న ప్రతి అడుగుతోనూ తనకూ తన సత్యవతికీ నడుమ అనవసరంగా ఏర్పడిన అంతరాయాన్ని తగ్గింపజేయగలుగు తున్నాడన్న స్ఫురణతో అతని అంగలు మరీ తొందరగాపడసాగాయి.

వెన్నెలకూడా రానురాను మరీ కాంతిమంతము కాసాగింది.

ఇక మ రేముంది?.ఏటిదగ్గఱకు వచ్చేసేను. అవతల అట్టే దూరం నడవనక్కరలేదు—అన్న తృప్తితో దిగబోతూంటే, "ఎవరయ్యా ఏటిలో దిగుతున్నది" అని కటువుగా కేక వినవచ్చింది.

తత్క్షణం ఎవరో దొంగో ఏమో నన్న అనుమానమూ, ఎవరయినా సరే తన నీవిధంగా ఆజ్ఞాపించడమా అన్న అహంకారమూ, హాయిగా చకచకా వెళ్లిపోతున్న తనను ఎందుకు నిల్వరించాలీ అన్న ఆగ్రహమూ ముప్పిరిగొనగా తానూ వీలయినంత కటువుగా "ఏం, ఎవరయితే నీకేం, నా యిష్టం." అని అరిచేడు.

"ఓ, నీ యిష్టమే! బతకాలని లేకుంటే దిగు; హోరుమని ఏ రొస్తుంటే ఇనబడలేదటయ్యా" అంది గొంతు రెట్టించిన ధ్వనితో.

అంతసేపూ తనకు వినబడని ఏటి హోరు అతి భయంకరంగా వినిపించసాగింది. ఏ ఆలోచనా లేకుండా తనను మందలిస్తూ గొంతు వినవచ్చిన దిక్కుకు వెఱ్ఱిగా పరుగందుకొన్నాడు.

"ఆగవయ్యా, మరేం భయం లేదు. ఇంకా ఎక్కడ? సూదికొండదగ్గర మలుపుతిరుగుతున్నది. అందుకే అంత హోరు" అంటూ నిలవరించాడు, తనను ఆపిన మనిషి దగ్గరకు వచ్చి.

ఎగఊపిరి సర్దుకొని "ఇక్కడికి ఏరు రాదా?" అన్నాడు సన్యాసిరావు.

"ఇంతెత్తుకొస్తే ఈ చుట్టుపక్కల ఊళ్లన్నీ నీటిలో మునిగిపోవాలి. నేను పుట్టి బుద్ధెరిగినకాణ్ణించి అంతే రెప్పుడూ చూడలేదు; మా నాయనయినా చెప్ప లేదు. చల్లని తల్లి ఏరుమాతల్లి."

అతని ధోరణి సన్యాసిరావుకు అట్టే నచ్చలేదు. కాని ప్రస్తుతావసరానికి సంబంధించిన ప్రశ్న వేయక ఉండబట్టలేదు. అయితే ఇప్పుడు ఏమాత్రం ఏరు వస్తుంది ఎంతసే పుంటుంది" అని అడిగేడు.

ఎంతోఏటో ఎక్కడో కొండల్లో నాలుగు చినుకులు పడితే ఏరు వస్తుందట. తీసిపోతే ఒకటి రెండు గంటల్లో తీసిపోవచ్చునుగాని, తెల్లవారేదాకా దిగడం ప్రమాదమేనట.

హుఁ, అనుకొన్నంతపనీ జరిగింది. ఆ స్టేషను లోనే పడిఉంటే తీరిపోయేది. ఇక్కడెక్కడా వాన వస్తే తలదాచుకొందుకుకూడా ఆస్కారం ఉన్నట్లు లేదు.

అవతలిమనిషి దగ్గరకు రావడంతో తన పెద్ద మనిషి తరహా గుర్తించినట్లున్నాడు. చాలా గౌరవిస్తూ మాట్లాడసాగాడు. కాని, ఏదో అవసరానికి సరిపడిన పాటి కటువుగా ఉన్నా ఇందాకటి మాటలే బాగున్నట్లున్నాయి. అంతేకాని, ఈ గౌరవవాచకా లెందుకు? ఈ తబిశీళ్లన్నీ కనుక్కోడం దేనికి? తమ స్వంత ఊరేది, అవతల ఏఊ రెళ్తున్నారు, ఎవరింటికి, వారేం కావాలి తమకు?—ఈ ధోరణి ప్రశ్నజాలంలో చివరి దానికి మాత్రం సరిగా సమాధానం చెప్పా లనిపించలేదు. "ఆఁ, బంధువులే, పనిఉండి వెళ్తున్నాను" అని ఊరుకున్నాడు. కాని అవతలిమనిషి అంత సులభంగా విడిచిపెట్టే రకంగా లేదు.

తానూ అదేఊరు వెళ్లవలసిఉందనీ, అసలు అది తమ స్వంత ఊరేననీ, తమకు భగవంతుడి దయవల్ల ఆమాత్రం ఈమాత్రం తిండికి లోటులేనిపాటి స్థితి ఉందనీ, తన భార్యను కన్న వారింటికి దిగబెట్టివస్తున్నాడనీ, రెండురోజులుముందే వచ్చేయవలసిన తనను బావమరదులు, వాళ్లూకొంత కలిగినోళ్లే కావడంవల్ల, ఉండిపోమని బలవంతంచేసేరనీ అలా చెప్పుకొని వెళ్లి పోతు

న్నంతసేపూ అంత చిక్కుగా తోచలేదు సన్యాసిరావుకు. కాని, ఈ ఏకపాత్రాభినయంతో తెల్లవారించక, మళ్లీ ప్రశ్నలలో పడడం చాలా అయిష్టంగా తోచింది. కాని, విసుగుకొంటూనైనా సమాధానాలు చెప్పడం తప్పలేదు సన్యాసిరావుకు. ఇదివరకు ఈ మనిషిని ఎన్నడూ చూడలేదు; ఇకమీదట ఈ జన్మలో మరి చూసే అవసరం పడకపోవచ్చును. కాని, అటువంటి మనిషి తన ఇష్టానికి విరుద్ధమయిన ఏవో ప్రశ్నలు వేస్తూంటే తాను సమాధానాలు చెప్పకుండా ఉండలేకపోతున్నాడు. సామీప్యంలో ఉన్న శక్తి అది. సత్యవతీ, తానూ ఇంతదూరంగా ఉండబట్టిగాని, నిజంగా తాము కలియలేకపోతేనేం, ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా, ఉన్నట్లుగా ప్రపంచంముందర నటిస్తూ ఒకే ఇంట్లో ఉండాలంటే ఎంత అసాధ్యమో అప్పుడు స్ఫురించింది సన్యాసిరావుకు.

అయితేనేం, ఇప్పుడు మరి అటువంటి నటన ఏమీ అవసరం లేదుకదా, తనకూ, తన సత్యవతికీ నడుమనున్నది హోరుమని ధ్వనిచేస్తూ వస్తున్న ఏరు ఒక్కటే. అది ఎంతకాలం నిలువగలదు? తెల్లవారితే సరి దాని ప్రతాపం. అప్పటికీ తియ్యకపోతే పడవ నడుస్తుంది.

అబ్బ! ఏమిటీ ప్రశ్నలు? తన పని ఏదయితే ఇతనికేం, ఊఁహూ? విసుక్కొని లాభం లేదు. ఇందుకు తగిన సుళువు చెయ్యాలి.

“కరణంగారితో పని అంటే చాలా ఉందిలే. కాని, నాయుడూ, ఇక్కడ మన పని ఈ సగం ఊడిపోయిన పాకలో పడివుండవలసిందే నన్న మాట. దగ్గర్లో ఏదీ ఊరు లేదూ?” అని మాట మరిపించడానికి చూసేడు.

నాయుడు దగ్గర్లో మరేమీ అంత మంచి ఊళ్లు లేవనీ, ఎవళ్ళింటికో వెళ్లి వాళ్లను లేపి బాధచేసి పడుక్కొనేకంటె, ఈవచ్చే ఏరు చూస్తూ ఇలా ఈ పాకలోనే పడుకోడం మంచిదనీ కాస్త వేదాంతబోధచేసి, మళ్లీ పల్లవి అందుకున్నాడు. కరణంగారికీ తనకూ ఉండే పరిచయమూ, వారి పెద్దన్నగారు చచ్చిపోవడమూ, ఆయనపిల్లలూ, వాళ్ల స్థితిగతులూ, సంరక్షణ చేయడానికంటూ ఆయమ్మ ఆ మేనత్తగారు ఉండబట్టిగాని, లేకపోతే ఆ పిల్ల లేమయిపోయిఉందురో అనీ, ఇంకా ఆవిడగుణగణాల వర్ణనమూ, భర్త దౌర్మార్గ్య నిరసనమూ చేయదొరకొంటున్న సమయంలో, మరి భరించలేక, మొండిగా “సరే, వాళ్ల సంగతులన్నీ మన కెందుకు? నాకు నిద్ర వస్తున్నది. ఈ సంచీ తలకింద పెట్టుకొని పడుకొంటాను. ఇంత ఎత్తుకు ఏరు రాదుకదా. అయినా నువ్వు మేలుకొనే ఉంటా నన్నావు. ఏం కాని, నీ గొంతు బాగా ఉంది. ఏమయినా తత్వాలో పదాలో వస్తే పాడుమూ, వింటూ పడుకొంటా” నన్నాడు.

పాటల ఊసెత్తడంతో నాయుడుకు ఒళ్లు పరవశమై పోయింది. తంబూరా మోగిస్తున్నట్లుగానే గాలిలో వేళ్లు మీటుతూ పాడడం మొదలుపెట్టేడు.

సన్యాసిరావుఉద్దేశం బాగానే ఫలించింది. మరి ఏ ప్రశ్నలగొడవా లేదు. అయితే, అలా రెండు మూడు పాటలు పాడేసరికల్లా పాడే మనిషికి నిద్రవచ్చినదిగాని, సన్యాసిరావుకు మాత్రం అదివరకు కనిపించినపాటీ నిద్ర వచ్చే సూచనలు కనబడలేదు.

ఇక మరి లాభం లేదని లేచి అటూ ఇటూ పచారు చేయసాగాడు.

అట్టే ఎత్తులేని గోడ త్వరత్వరగా నడుచుకొని వస్తున్నట్లుగా ఏరు వచ్చేస్తూంది. ఇంకా దూరాన చప్పుడుమాత్రం వినిపిస్తూనే ఉంది. మొదట అనుకొన్నంత భయంకరంగా కనిపించలేదు. ఆ మెత్తని వెన్నెలవెలుగులో తళతళలాడుతూ సాగిపోయే నీటిని చూస్తూఉంటే అనవసరంగా మనుష్యు లింతగా భయపడతారుగాని, ఆ నీటిలో తేలిపోయే కఱ్ఱదుక్క మీద వెళ్లికూర్చుంటే నిర్విచారంగా ఏటితోపాటు హాయిగా ప్రయాణం చేయవచ్చు నన్నంత తేలికగా తోచింది ఒక క్షణంలో. మళ్ళీ మరుక్షణంలోనే నిత్యకృత్యంలో ఎందరికో జీవనాధారమైన ఈ ఏరే, ఒక్కమారు పొంగి పొలాలనూ, ఇళ్లనూ, ఊళ్లనూ ముంచెత్తి ఎందరినో తనపాట్ల పెట్టుకొని క్షోభింపజేస్తుం దన్న స్మృతితో ఒక్కమారు ఒళ్లు గగుర్పొడిచింది. అప్రయత్నంగానే ‘నాయుడూ, నాయుడూ’ అని పిలిచేడు. కాని, మధ్యా

హాన్ని విందుభోజనం చేసి, అవతల కొన్ని మైళ్లూ ఇవతల కొన్ని మైళ్లూ నడిచి తను ఏమీ పొరపాటు చెయ్యడం లేదన్న నిబ్బరంతో హాయిగా నిద్రవచ్చే పర్యంతం పాటలు పాడుకొనే అతగాడికి సన్యాసిరావు పిలుపుతో తెలివిరాలేదు. ఏదో అకస్మాత్తుగా పిలిచాడే తప్ప, అతను లేవాలని కోరిక లేదుకదూ! కాస్త నిబ్బరపడి, అకారణంగా ఏదో ఊహామాత్రంచేతనే భయపడిన తన అశక్తికి నవ్వుకొంటూ కూర్చున్నాడు.

అలా కొంతసేపు విరామం లేకుండా వినడంవల్ల కాబోలు ఏటిరొద ఇందాకటి అంత బ్రహ్మాండంగా వినిపించలేదు.

సంచీ సర్దుకొని తలకింద పెట్టుకొని, కళ్లుమూసుకొన్నాడు. కళ్లుమూసుకొనేసరికల్లా, ఏరు ఇందాకా తాను చూసినకంటె వెయ్యింతలు భయంకర స్వరూపంతో, చిన్న చిన్న ఇళ్లూ, పెద్దపెద్ద చెట్లూ తనలో కొట్టుకుపోతున్నట్లుగా, ఆ చెట్ల నంటిపెట్టుకొని పెద్ద పెద్ద కొండచిలువ లున్నట్లూ, మధ్యమధ్యను కొన్ని త్రాచుపాములు నిట్టనిలువుగా తోకమీద నిలబడి బుసలు కొట్టుతున్నట్లుగోచరించింది. మరి కళ్లు మూసుకొని ఉండలేకపోయేడుసన్యాసిరావు. మళ్ళీ కళ్లు విప్పి, లేచికూర్చుని తనలో, తన ఈ ఇన్ని సంవత్సరాల జీవితంలోనూ దాఖలాగా అనుభవానికి రాని భయోత్పన్నకమూ, బ్రతకాలనే వాంఛా ఇమిడిఉండడాన్ని గూర్చి ఆలోచించసాగాడు. ఈ మన స్వభావంలో అన్నీ ఇమిడిఉండి, దేని సమయం వచ్చేసరికల్లా అది బైట పడుతుందికాబోలు. ఈ విజనప్రాంతంలో విశాలమూ, భయంకరమూ అయిన ప్రకృతిమధ్యను ఈవిధంగా ఒంటరిగా ఉండిఉండకపోతే, తను మామూలుగా రాత్రి ఎనిమిదిగంటలకు భోజనంచేసేక మేరీని కొంతసేపు ఆడించి, పేపరు చదువుకొంటూ పడుకొంటే తనకు తనలోని భయపడే తత్వం ఇంతలా ఉందని ఏం తెలుస్తుంది? అంతే కాదు, ఇంతకాలమూ తనకూ సత్యవతికీ నడుమ ఉండే ఎడం కేవలం తనుమాత్రమే కల్పించినట్టి దనీ, ఏనాడయినాసరే కావాలంటే తను ఆ ఎడాన్ని కలిపివేయగల డనీ నిబ్బరంగా అనుకొంగలిగేవాడు.

కాని చూడగాచూడగా అంతా తనమీదే ఆధారపడిఉన్నట్లు లేదు. దారిలో రైలుప్రమాదం జరిగిఉంటే? అంతెందుకు, ఇందాకా తను ఏట్లో దిగుతున్నప్పుడు ఈమనిషి వెనకనించి ఆగమని కేక వెయ్యకపోతే, ఏ ముంది, తాను సగంమేర వెళ్లేసరికే ఏరు రావడమూ, తాను కొట్టుకొనిపోయిఉండడమూ జరిగిఉండేది. ఆ ఒక్క కేకలోనూ తనను బ్రతికించిన శక్తి ఉంది. కాని అలాగని తను ఆ కేక వేసిన మనిషికి మరీ కృతజ్ఞుడుగా ఉంటున్నాడా? లేదు, అత నేవో ప్రశ్న లడిగితే విసుగుకొన్నాడు.

తనను, అంటే కరణంగారి బావమరదిని దుర్మార్గు డంటేనేం? తనకు కావలసిందే అది. సత్యవతి గురించి ఎంత గౌరవంగా, భక్తిగా, చెప్పేడు. ఇంకా మరికొంత చెప్పనిచ్చిఉంటే మరేమయినా చెప్పునేమో. హుఁ, ఇంకా తనను తన అనుమానపు స్వభావం విడిచిపెట్టలే దన్నమాట. ఛ! అటువంటి తలపులకే తా వియ్యకూడదు తన మనసులో. వాటివల్లనే తా నింతకాలం ఒంటరిద్రోహు జీవితాన్ని అది సుఖమా దుఃఖమా అన్న వివేచన లేకుండా గడపడం జరిగింది. ఇప్పుడయినా ఆ రెయిలు మధ్యను ఆగిపోకుండా ఉండిఉంటే, ఈసరికి తానూ సత్యవతీ ఆమె వ్రాసినట్లుగా ఈ పదిసంవత్సరాల ఎడబాటునూ మరిచిపోయి, నిర్విచారంగా, అమాయికులయిన పసిపాపలలాగ హాయిగా కబుర్లు చెప్పుకొంటూ ఒకరి సరసను ఒకరు కూర్చొని ఉండగలిగేవారుకదా!

తనను చూడగానే సత్యవతి ఏం చేస్తుందో? తనతో మాట్లాడుతుందో లేదో? లేక గట్టిగా నాలుగు మాటలూ మొగంమీద అంటుందో? ఏమయినా బాధ లేదు. ఏడవకుండాఉంటే. ఏడిస్తేమాత్రం తను భరించ లేడు. ఆమెకు తాను చేసిన అన్యాయాన్ని తలచుకొంటేనే ఏడుపు వస్తున్నది. ఇక, ఆమె ఏడిస్తే ఆ ప్రవాహానికి అడ్డు ఉంటుందా?

వెళ్లగానే తనకు బావమరది ఎదురవుతాడేమో. వాళ్లంతా తనను చాలా వింతగా చూస్తారు. ఏమిటి మాట్లాడ్డం? ఏవిధంగా తన ప్రస్తుతోద్దేశాన్ని

తెలియజెయ్యడం? వాళ్లు ఒకంతట తనను నమ్ముతారా ?

తను అనుకొన్న ప్రకారం రాత్రే వెళ్లగలిగితే, ఇతరులప్రసక్తి అట్టే లేకుండా తానూ సత్యవతీ రాత్రి అంతా మాట్లాడుకొందు కయినా సావకాశం ఉండేది. ఉదయం వెళ్లడం అంటే తామిద్దరూ మాట్లాడుకొందుకు అసలే వీలు కలుగదేమో? ఆఁ, ఇంకా తాను మొగమాటపడడం దేనికి? వెళ్లగానే, పల్కరింపులూ అవీ అయిపోయినవెంటనే, సత్యవతిని వేరే పిల్చి తన గతచర్య అంతటికీ క్షమాపణ కోరుకొని ప్రస్తుతనిశ్చయానికి మారుమాట చెప్పడానికి వీలులేకుండా ఒప్పించి, వీలయితే రేపు సాయంత్రానికే ప్రయాణం ఏర్పాటుచేయాలి.........కావాలని పడుకొంటే భయం వేసిందిగాని, అలా ఏదో ఊహిస్తూఉంటే ఎప్పుడు వచ్చిందో తెలియకుండానే నిద్రవచ్చింది.

ఉదయం మెలుకువ వచ్చేసరికి రాత్రి అంత ఏకముఖంగా నిశ్చయంగా ఉన్న తన ఆలోచనలు చాలావరకు పలచబారిపోయాయి. మళ్లీ ఒకమారు ఏమిటో—తన ప్రయాణంప్రకృతిశక్తులకు కూడా విరుద్ధమయినదికాబోలు; లేకపోతే రైలు దారిలో మూడు గంటలు ఆగిపోవడం దేనికి? వేళకు ఏరు రావడం ఏమిటి? ఇదంతా ఇన్ని సంవత్సరాల అనంతరం చేసే ఈ తన ప్రయత్నం తెలివితక్కువ దని మందలించడం కాదూ? తిరిగివెళ్లిపోతే! ఏమి బాగుంటుంది? ఆమాత్రానికి ఆస్టేషనులోనయినా ఉండకుండా ఇక్కడ రాత్రంతా పడిఉండడం దేనికి? అయినా అదుగో మొగం కడుక్కొని వస్తున్నాడు నాయుడు. ఏరు ఎంత తీసిపోయింది? ఇప్పుడు తను తిరిగి వెళ్లిపోతే, అతడు వెళ్లి ఊర్లో వింతగా చెప్తాడు. నలుగురూ నాలుగురకాలుగానూ అనుకొంటారు. కొందరు ఆ వచ్చివెళ్లినది తానే అని పసికట్టేవాళ్లుకూడా ఉండకపోరు. ఈమధ్యను నిరాశతో ఉత్తరాలుకూడా మానుకొన్న సత్యవతికి ఈ వార్త తెలిస్తే మరింత బాధాకరంగా, పాతగాయాన్ని కెలికినట్లుగా అవుతుంది. అయినా, ఇంతదూరం వచ్చి తిరిగిపోవడం ఏమిటి? తాను మునపటంత పిరికివాడు కాడు.

కాని, తీరా వెళ్లినతరవాతమాత్రం సన్యాసిరావుకు చాలా ఆశాభంగం కలిగింది. తన బావమరిది వెంకటరావు తాను వచ్చినందుకు ఏమీ బ్రహ్మానంద భరితుడు కాలేదు. లోపల్లోపల చాలా విసుక్కుంటూ "అయితే, ఇప్పుడు నువ్వు వచ్చిన పని ఏమిటి" అన్నట్లుగానే మాట్లాడేడు. తన ఉద్దేశం అతనికేమీ నచ్చినట్లు కనబడడం లేదు. పైగా మొట్టమొదటే పేచీకోరుగా, "అప్పటికంటె ఇప్పుడు అన్నీ ధరలు పెరిగిపోయేయి. కరువుకాటకపురోజులు. కోర్టుకు వెళ్తే ఎలాగూ ఎక్కువ ఇయ్యవలసివస్తుందని ముందుకాళ్ల బందంకాబోలు"అన్నాడు. సన్యాసిరావుకు గతరాత్రి తనలో నిబిడీకృతమయిఉన్న భయం ఎంతో తెలిసినట్లుగానే, బావమరిదిఈ ధోరణితో తనలో ఇంకా ఎంత ఆగ్రహం ఇమిడిఉన్నదో కూడా తెలిసివచ్చింది. కాని లోపల్లోపలే అణచుకొని "ఇప్పుడు నే నంటున్న మాటకూ డబ్బుకూ ఏమిటి సంబంధం" అన్నాడు. వెంకట్రావు తక్కువవాడు కాడు; నెలకు ఇరవై రోజులు కోర్టుల నడుమనే గడిపే మనిషి—"మరయితే ఈ నటనంతా దేనికి? ఇన్నాళ్లూ లేని అభిమానం ఇప్పుడు ముంచుకొనివచ్చింది కాబోలు. అంత డబ్బు పంపలేకపోతే ఒక అయిదో పదో తగ్గించిపంపితేసరి, దానికి జబ్బులు వస్తే చెయ్యలేక బాధపడి చచ్చేది మేము. ఏమిటో ఈ అకారణాభిమానం, నే న్నమ్మతే" నన్నాడు.

తన ఆగ్రహాన్ని అతిప్రయత్నంమీద అణచుకొని, "సరే నీ సొదంతా ఎందుకులే? అ దేదీ?"అని అడిగేడు.

వెంకట్రావు మాట్లాడకుండా చుట్టపొగ పీల్చి, చేతితో సంజ్ఞచేసి చూచేడు వంటింటివంకకు.

సన్యాసిరావు తన ఎట్టఎదురుగా నిలబడిన మనిషి సత్యవతేనని అలా కొంతసేపు తేరిపార చూస్తేనేగాని నమ్మలేకపోయేడు.

ఆ సంస్కారంలేని జుట్టుముడి, మాసిన, అక్కడక్కడ మాసికలుపడిన చీర, ముసలిముత్తైదువులు కట్టునటువంటి కట్టు, లోతుకు పోయిన బుగ్గలు, కాంతిలేని కళ్లు, దుర్బలంగా వేళ్లాడుతున్న చేతులూ.....

ఆమెను చూస్తూంటే తన గతపాపానికి ఫలితంగా ఏదో అగాథంలోనికి పడిపోతున్న ట్టనిపించింది సన్యాసిరావుకు.

ఇన్ని మార్పు లున్నా, ఆమెచిరునవ్వులో మాత్రం మార్పు లేదు. అదే తనను కాపాడింది. లేకుంటే ఎందుకో తనకే తెలియకుండా ఏడ్చిఉండే వాడే. ఆ చిరునవ్వుతో తన గాభరా తగ్గి మామూలు మని షయేడు. కాని, ఏమిటి మాట్లాడ్డం అన్నది మాత్రం ఇదమిత్థ మని తేల్చుకోబడలేదు. ఆమెమాత్రం రోజూ చూస్తున్న మనుష్యులతో మాట్లాడినంత నిబ్బరంగా మాట్లాడగలిగింది. "సాయంత్రం రయిలులో వచ్చేరుకాబోలు. ఏరు రావడంవల్ల దారిలో ఆగి పోయిఉంటారు"అని కొంచెం ఆగి, అంది: "మరి ఈ జన్మలో చూడగల ననుకోలేదు. గదిలో కుర్చీమీద కూర్చోండి, ఇప్పుడే కాఫీతెస్తా"నని లోనికి వెళ్లింది.

కాఫీ తెచ్చి, బల్లమీద పెట్టి, ఇంక ఏమీ మాట్లాడ్డానికి సావకాశం లేకుండానే లోనికి వెళ్లి పోయింది.

కాఫీ తాగి కుర్చీలో వెనక్కు చేరగిలి పడు కొన్నంటే చిన్న కునుకు పట్టింది.

మేలుకొని, ఏమిటి చెయ్యడమా అని ఆలో చిస్తున్న సమయంలో ఎవళ్లో ఎనిమిదేళ్ల అమ్మాయి, వెంకట్రావుకూతురుకాబోలు, "స్నానానికి లెమ్మం టూంది అత్తయ్య" అంది.

వడ్డన సత్యవతే చేసింది. కాని, వెంకట్రావు పక్కనే కూర్చొని భోంచేస్తూఉండడంవలన ఏమీ మాట్లాడా లనిపించలేదు. భోజనానంతరం కనిపిస్తుం దేమో నని, నిద్రవస్తున్నా బలవంతంగా మేలుకొని, దగ్గరున్న గూటిలోనివి ఏవేవో పురాణపుస్తకాలు తిరగవేసి, కొన్ని తీసి పక్కనుపెట్టుకొని కుర్చీలో కూర్చున్నాడు. కాని, ఆమెజాడ ఏమీ లేదు.

మధ్యాహ్నం భోజనానికి పిలిచిన అమ్మాయే మూడు గంటలకు కాఫీ, బియ్యపుమొరుంతో చేసిన ఉప్మా తెచ్చి "అత్తయ్య ఇమ్మంది" అంది.

రాత్రి భోజనానంతరం వెంకట్రావు తన పక్క చూపించేడు, వీథరుగుమీద ఒకతట్టు అతని మంచం, ఇంకొకతట్టు తన మంచం వేసిఉన్నాయి సన్యాసిరావుకు వెంకట్రావుమీదే కాదు, ఇలా దూర దూరంగా ఉండి దాగుడుమూతలాడుతూన్న సత్యవతి మీదకూడా కోపం వచ్చింది. ఏమి టీ అన్యాయం, మంచో చెడ్డో ఇంతకాలంతరవాత, తాను మనసు తిరిగి వస్తే, ఎవడో దూరపు బంధువుకు తప్పనిసరిగా ఇంట్లో తిండి పడేసి, ఇక నీ కర్మం నీది అన్న ట్లుండడ మేమిటి ?

మనిషి అంతలా వికృతంగా మారిపోయినా, ప్రొద్దున ఆమెచిరునవ్వులో తాను ఎన్నో ఆశా సౌధాలు కట్టుకోగలిగేడు. కాని, అందుకు తన అత్యాశే కారణం అయిఉండవచ్చును.

ప్రస్తుతం తన కర్తవ్యం ఏమిటి? ఆమెకూడా వెంకట్రావులాగే తనంటే అతిగా అసహ్యించుకొంటు న్నదా ? మరి ఉదయం 'ఈ జన్మలో మరి చూడగల ననుకోలేదు' అన్న మాటకు అర్థం ఏమిటి? అప్పుడు ఉత్తరాలలో ఒక్కమారు కనిపిస్తే చాలును, తన కీ జన్మలో ఇంకే కోరికా ఉండదనీ, అధమం తన దగ్గర నుండి ఉత్తరం వచ్చినా తన మనస్సుకు ఎంతో నిండుగా ఉంటుందనీ రాసిన ఆ సత్యవతేనా ఈ సత్య వతి? తీరా వస్తే తనను తప్పించుకొని తిరుగుతున్న దేమి చిత్రమో!

తొలినాటి ఉద్రేకం లేకుండా మర్నాడు పరిస్థితులకు యథాతథంగా అర్థంచేసుకొందుకు ప్రయ త్నించడంతో సన్యాసిరావుకు కొత్తవిషయాలు చాలా తెలుసుకోవలసివచ్చింది. వెంకట్రావుకొత్త వాదం మరీ అంత స్వార్థరహితమయినది కాదు. సత్యవతి ఉండడంవలన నెలనెలా నలభైరూపాయిలు రావడం అటుండగా, ఆమె ఎంత దుర్బలంగా ఉంటేనేం, ఇంట్లో అందరికీ అన్నీ అందుబాటుచేసే మనిషి తగ్గిపోతుంది ఆమె వెళ్లిపోతే. కాక ఆమె బంగారపువస్తువులుకూడా వంటిని ఉన్నట్లు లేవు. వాటినిగురించి తా నేమయినా పేచీపెడతాడేమో నన్న భయంకూడా కొంత కారణం కావచ్చును అతని ఈ ముందరికాళ్ల బందపు వాదానికి.

ఇంత చాకిరీ చేయించుకొని, సరియయిన బట్టలుకూడా కొంటున్నట్లు లేదు. తాను అంత

కఠినంగా ప్రవర్తించినప్పుడు, ఇతరులు నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించడంలో వింతేముంది ? పాపం, ఎంత కష్టపడి రాసిందో, "నిజంగా నాకు మీకంటే నా అనేవాళ్లెవళ్లున్నారు చెప్పండి" అని. లేకేం, వాళ్లవాళ్లంతా ఉన్నారుకదా అనీ, లేకపోయినా ఉన్నా తనకేం సంబంధ మనీ మొండిగా అనుకొన్నాడు. కాని, ఇలాగని తెలిసిఉంటేనో ? సానుభూతితో ఊహించలేనివాడికి ఏం తెలుస్తుంది. మనస్సుకు లేని సుఖం ఎలాగా లేదు. సరిగా తిండీ బట్టాకూడా లేక ఇతరుల ఆరోగ్యాలు కాపాడడమే తప్ప, తన ఆరోగ్యం సంగతి చూసేవాళ్లు లేకుండా, ముప్ఫైఏళ్లకే నలభై అయిదేళ్ల మనిషిలా కనిపిస్తున్నదంటే అందుకు పూర్తిగా తనే బాధ్యుడు. వెంకట్రావు ఏమన్నా సరే, ఆమెకు ఇష్టం ఉన్నా లేకపోయినా సరే, వెంటనే తీసుకొనివెళ్లి ఆరోగ్యం చేకూర్చడం తన విధి.

మధ్యాహ్నం భోజనానంతరం లేస్తూ, "అనక భోంచేసేక ఒకమారు కనిపిస్తావుకదూ? నీతో కొంచెం మాట్లాడాలి" అన్నాడు.

ఆమె అలాగే అని, అతను చెయ్యి కడుక్కొని వచ్చి కుర్చీలో కూర్చొనేవేళకే వచ్చింది. కాని అతను ఒప్పుకోలేదు. "ఉఁహుఁ, నువ్వు వెళ్లి భోంచేసిరా, తరవాత మాట్లాడుకొందాము" అన్నాడు. ఆమె ఏమీ అనకుండా తలవంచుకొని వెళ్లి ఒక పది నిమిషాలలో తిరిగివచ్చి కుర్చీదగ్గర నిలబడింది.

అతను, కాళ్లదగ్గిర బల్ల సర్ది, అందుమీద కూర్చోమని, ఆమె సంకోచిస్తూఉంటే చేయి పట్టుకొని కూర్చోబెట్టేడు.

అతనికి అంతసేపూ నిశ్చయంచేసుకొన్నమాట లేవీ స్ఫురించలేదు. ఎట్టకేలకు అతిప్రయత్నంమీద "సత్యా, సత్యా, పాత వన్నీ మరిచిపోయి నాతో రావూ, నన్ను క్షమించవూ ?" అన్నాడు.

"నేనా, మీతో రావడమా, నిజమేనా మీ రన్నమాట? నే నేనింకా మీరు మళ్లీ పెళ్లి చేసుకొనే ప్రయత్నంలో ఉన్నారనుకొంటున్నాను. అయినా మిమ్మల్ని మళ్లీ చూడగలిగేను. నా కింతే చాలును" అంటూ వాలిపోయింది అతని గుండెలమీదికి.

అతని చొక్కా, ఆమెజుట్టూ రెండూ తడిసిపోయేయి ఉభయుల కన్నీళ్లతోనూ.

"అయ్యో! ఇంత ఆనందసమయంలో ఈవిధంగా ఏడుస్తున్నావేమిటి" అని ఆమే, "ఈమెను ఓదార్చే మాటలు చెప్పలేకుండా అంతకంటే బలహీనంగా ఏడుస్తున్నావేమిటి చెప్మా" అని అతనూ ఇద్దరూ లోపలోపల విరమాలుకొంటూనేఉన్నారు. కాని, బైటికి ఏమాటా రావడంలేదు.

సత్యవతికి ప్రయాణానికి సర్దుకోవలసిన వస్తువులే అట్టే లేకపోయేయి. ఉన్నవల్లా ఆ నాలుగు పాత చీరలే. తక్కిన ఖరీదయిన వన్నీ ఏనాడో వదినెగార్లూ, మేనకోడళ్లూ కట్టుకొని చింపేసేరు. బట్టలపెట్టెకూడా కిందటిమారు వచ్చినప్పుడు పట్నంలో చదువుకొంటున్న మేనల్లుడు పట్టుకొనిపోయేడు.

కాని, వెంకట్రావుమాత్రం వేళకు లౌక్యుడే. లోపట జనానాలో జనాంతికంగా పోట్లాట వచ్చినా, లెక్కచేయకుండా, తను కొత్తగా కొన్న పెట్టె ఖాళీ చేయించి ఆ నాలుగుబట్టలనే అందులో సర్దించేడు. అప్పటికప్పుడు మనిషిని పొరుగూరికి పంపించి, రైలువేళలోపున ఒక జరీఅంచులున్న పంచల చాపూ, ఒక అక్కడున్నవాటిలోకల్లా మంచిచీరా తెప్పించి, తానూ స్టేషనుకు వచ్చి, టిక్కెట్లు కొనిఇచ్చి, చెల్లెలిచేతిలో బావ చూస్తూండగా రెండు పదిరూపాయిల నోట్లు పెట్టి, "పండగకు నేనే పిలవడానికి వస్తాను. ఏమో తప్పనిసరిపన్లవల్ల కదలడానికి వీలు లేకపోతే ఉత్తరం రాస్తాను. ఇద్దరూ తప్పకుండా రావాలి సుమండీ" అన్నాడు.

తన బావమరిదిప్రవర్తనలో ఈ ఒక్కరోజులోనూ వచ్చిన మార్పు సన్యాసిరావుకు వెంటనే అర్థంకాలేదు. కాని సత్యవతికిమాత్రం చూచాయగా తెలియకపోలేదు. పాతలెక్కలూ, బంగారపు తగాదాలూ లేకపోతే తనవంటిరోగిష్ఠిని వదిలించుకోడమే శ్రేయస్కరమనీ, ఆమాత్రం ఇంటిపని చెయ్యడానికి ఎవరయినా వంటమనిషి దొరక్కపోదనీ వదినగారి సలహా. అయితే, ఆ సలహాను పాటిస్తూనే అయినా, అందులో కొంత తన స్వంతపద్ధతిని ప్రవేశపెట్టేడు అన్నయ్య—బట్టలు కొనడం, పెట్టె, పరువు మొదలయినవి సర్దుబాటు చెయ్యడంలోను.

ఏమయినా తా నిప్పుడు అన్నివిధాలా అదృష్టవంతురాలు. ఇక తనకు ఈ క్షణంలోనే చావు వచ్చినా విచారం లే దనుకొంది. తిరుగుప్రయాణంమధ్య ఎటువంటి అవాంతరాలూ లేకుండానే గడిచింది.

ఇక తమ మధ్య ఏవిధమయిన అడ్డుగోడా లేదని తృప్తిపడ్డాడు సన్యాసిరావు. కాని, పన్నెండు సంవత్సరాల విభిన్న జీవితాల స్థితిగతులూ, అలవాటులూ ఒక్కమారుగా అంతరిస్తాయా ?

తనగురించి శ్రద్ధతీసుకొనేవారు లేని రోజుల్లో అలాఅలా నిలిచిఉన్న ఆమెఆరోగ్యం విపరీతమయిన జాగ్రతతో వైద్యం మొదలుపెట్టినదగ్గరనుండి పూర్తిగా చెడింది.

"నాగురించి అనవసరంగా బాధపడి, మీ వంటికి చెడుపు చేసుకొంటూరు. నాకేమీ జబ్బులేదు. ఇలా పనీ, పాటూ లేకుండా పడుక్కోవడమే నాకు అనారోగ్యం. లేచి మామూలుగా నాలుగుపనులూ చేసుకొంటే ఏమీ ఉండదు"అంటుంది.

కాని అతను ఒప్పుకోడు. "పోనీ, నీ కిష్టం లేకపోయినా, నాకోసమయినా నువ్వు మందుపుచ్చుకొని, డాక్టరు చెప్పినప్రకారం విశ్రాంతి తీసుకోండూ. నాకిదేమీ కష్టంగా లేదు. ఎంతో ఆనందంగా ఉంది–నిన్ను ఇంకా ప్రమాదస్థితిలోకి రాకుండా కాపాడు కోగలిగేనని" అంటాడు.

చుట్టూఉన్న ప్రపంచానికిమాత్రం చాలా ఆశ్చర్యంగా ఉండేది వారి దాంపత్యచరిత్ర. ఆమె అందంగా ఆరోగ్యంగా ఉన్నంతకాలం విడిచిపెట్టి, ఇప్పుడీవిధంగా నిత్యమూ రోగిష్ఠిగానే ఉన్న ఆమెకు పరిచర్య చెయ్యడంలోనే, ఆఫీసుపనిలో గడవగా మిగిలిన కాలమంతా సన్యాసిరావు ఎలా గడుపుతున్నాడా అన్నది లోకుల సమస్య. ఈవిషయంలో అందరికంటె ఎక్కువ ఆశ్చర్యంగా ఉండేది సత్యవతికి.

ఆవేళ అప్పుడే ఆఫీసునుండి వచ్చిన సన్యాసిరావు ఆమెను నెమ్మదిగా లేపి తనకు ఆనుకొని కూర్చోబెట్టి, మందు తాగమని బలవంతం చేయసాగాడు. ఆమె తనలో అతను లేనంతసేపూ అనుకొన్నమాటలు అనకుండా ఉండలేకపోయింది. "ఎందుకు నాగురించి ఇంత ఆందోళన పడతారు ? నేను బ్రతికిఉండడం మీకు మరీ శ్రమ కలిగించడానికే కదా ? నావల్ల మీకు కించిత్తయినా సుఖం ఉందా చెప్పండి" అంది.

కాని సన్యాసిరావుకూడా ఏమీ తీసిపోలేదు. "ఇంతకంటే నాకేం సుఖం కావాలి చెప్పు సత్యా? ఎల్లప్పుడూ ఆఫీసుకాగితాలుతప్ప తక్కిన ప్రపంచంతో సంబంధం లేని, నా మొరడుజీవితానికి మళ్లీ వసంతలక్ష్మిలా నువ్వు వచ్చేవు. నిన్ను కనిపెట్టిఉండడంలో, నీకు పరిచర్య చేయడంలో నాకు ఇదివరకెన్నడూ ఎరగని వినూత్నవికాసం కనిపిస్తూంది. ఇదంతా నువ్వు ఒప్పుకోకపోయినా, వెనక నిన్ను పెట్టినహింసకు ప్రాయశ్చిత్త మనుకో"అన్నాడు.

ఆమె సస్మితంగా "నాకేం, నేను మావాళ్లింట్లో ఉండేదానిని. ఏవో ఇంట్లోపనితో పిల్లలను సందరించడంలో నాకు రోజు ఇట్టే గడిచిపోయేది. మీరే, పాపం, ఒంటరిగా వేళకు తిండీ తిప్పలూ చూసేవాళ్లు లేక ఎంత బాధపడ్డారో"అంది అతని చేతిని తన రెండుచేతులతోనూ పట్టుకొని.

"అవునవును, ఎవళ్లు బాధపడ్డారో మన మనుష్యులను చూస్తేనే తెలుస్తుంది. నిన్ను చూసి, నాకంటె పదేళ్లు పెద్దయిన మా అక్కయ్య అని చెప్పినా నమ్మడానికి వీలుగా ఉన్నావు. మరొక్క ఆరునెల్లు నేను రావడం ఆలస్యం అయితే, సరే, మరెందుకులే ఆ సంగతి, నాకేం వాళ్లమీద కోపం లేదు. ఆ స్థితిలో వాళ్లు మరికాస్త ఉదారంగా ప్రవర్తించిఉండవలసిం దనడానికి నాకు హక్కు లేదు. అందుకే నా పొరపాట్లన్నిటికీ నీకు ఎంత సేవచేసినా పూర్తిఅయిన ప్రాయశ్చిత్తం కా దంటున్నాను. అబ్బ! మరేం కా దనకు. ఈ సందర్భంలోమాత్రం నా కుండేటికి మూడే కాళ్లు"అని ఆమెనుదుటిమీద చెయ్యివేసి చూసి, "అదుగో మళ్లీ ఒళ్లు వేడిగా ఉంది. ఉదయం మందు తాగేవు కావు. మరి ఇన్నిమాట లెందుకు? నువ్వు మందు తాగని పూటలల్లా నేనూ అన్నం మానేస్తూఉంటాను. నీ యిష్టం"అని లేచి, సీసాలో మందు గ్లాసులో పోసి ఆమెపెదవుల కందించేడు.

"ఇంత చేదుమందు తాగుతున్నానుగనక, మీరు సరిగా అన్నం తింటున్నారో లేదో నన్ను దగ్గర కూర్చొని చూడనియ్యాలిసుమండీ"అని మందు తాగింది సత్యవతి.

---